క్లుప్తంగా

శ్రీహరికోట సందర్శన



రాకెట్ నమూనాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

మడకశిరరూరల్: మండలంలోని రేకులకుంట ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులతో పాటు భౌతికశాస్త్రం ఉపాధ్యాయురాలు శ్రీహరికోటను సందర్శించారని హెచ్ఎం గిరిజమ్మ తెలిపారు. వైజ్ఞానిక యాత్రలో భాగంగా రేకులకుంట పాఠశాల నుంచి 9వ తరగతి చదువుతున్న ఎస్.గాయుత్రి, సింధు, 8వ తరగతి చదువుతున్న అనుశ్రీ, చందన, శాన్విక విద్యార్థులు, ఉపాధ్యాయురాలు విజయభార్గవి షార్ అంతరిక్ష పరిశోధన కేంద్రానికి (శ్రీహరికోట) వెళ్లారని పేర్కొన్నారు. అక్కడి శాస్త్రవేత్తలను కలిసి శాస్త్ర సాంకేతిక అంశాలను తెలుసుకున్నట్లు వెల్లడించారు. అదే విధంగా కుప్పంలోని ఆగస్త్య ఫౌండేషన్‌ను సందర్శించారన్నారు. వైజ్ఞానిక యాత్రకు వెళ్లిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు



మున్సిపల్ కార్యాలయంలో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేశారు. రోటరీ క్లబ్ సౌజన్యంతో రూ.లక్ష వెచ్చించి ప్లాంట్ ఏర్పాటు చేయగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, చైర్మన్ డీఈ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యుడు బద్రీనాథ్ కు కమిషనర్, చైర్మన్‌కృతజ్ఞతలు తెలిపారు. వేసవి దృష్ట్యా ప్రజలు , కార్యాలయ సిబ్బందికి తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ప్లాంట్ వితరణ చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

ఎక్సైజ్ అధికారుల విస్తృత దాడులు



స్వాధీనం చేసుకున్న మద్యం, ద్విచక్రవాహనం చూపుతున్న సిబ్బంది

హిందూపురం టౌన్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ మేరకు శనివారం ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐ లక్ష్మీదుర్గయ్య వివరాలను వెల్లడించారు. చిలమత్తూరు మండలంలోని మోరసలపల్లికి చెందిన రామాంజి, హిందూపురం పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన మంజుల, మారు కర్ణాటక మద్యం తరలిస్తుండగా మూడు కేసులు నమోదు చేశామన్నారు. వారి నుంచి 205 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, ఒక ద్విచక్రవాహనం స్వాధీన చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐలు ఫరూక్, నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుల్స్ నరసింహ, వెంకటేష్, సతీష్, కానిస్టేబుళ్ల అంజి, సురేష్, కుమార్, రంగదామా, శివ, సుధాకర్ రెడ్డి, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మండల పూజ

రొద్దం: తురకలాపట్నం గ్రామంలో పావగడ-పెనుకొండ ప్రధార రహదారి పక్కన ఇటీవల ప్రతిష్టించిన పంచముఖ అంజనేయస్వామికి శనివారం మండల పూజ నిర్వహించారు. ఉదయం పండితులు అర్చనలు, అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు న్యాయవాది సుదర్శన్ రెడ్డి అనదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మారుతిరెడ్డి, కలిపి శ్రీనివాసులు, రాజారెడ్డి, బి.నారాయణరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

62 చెరువులకు ఎత్తినహొళె నీరు



నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పరమేశ్వర్

పావగడ: తాలూకా సరిహద్దులోని కొరటగెరె తాలూకా పరిధికి చెందిన 62 చెరువులకు నీరు నింపే ఎత్తినహొళె పథకాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి డాక్టర్ పరమేశ్వర్ ప్రారంభించారు. శనివారం తాలూకాలోని గౌరవనహళ్లి గ్రామంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, తుముల్ అధ్యక్షుడు హెచ్వి వెంకటేశ్, చిన్న నీరావరి శాఖ మంత్రి బోసరాజు, జెడ్పీ సీఈఓ జి ప్రభు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర గౌడ తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేశ్ మాట్లాడుతూ.. త్వరలోనే ఎత్తినహొళె నీటితో పావగడ చెరువులను సైతం నింపుతామని పేర్కొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

గోరంట్ల: స్థానిక వాసవీ మహల్ ఫంక్షన్ హాల్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు జీయం శేఖర్, కార్యదర్శి, విశ్రాంత ఆర్డీఓ విశ్వానాథ్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బాలరాం గుప్త తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల్లో కోత

- ఎఫ్‌పీ షాపుల్లో పూర్తిస్థాయిలో అందని సరుకులు
- బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు
- లబోదిబోమంటున్న పేదలు
- ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం



రొళ్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యం అవుతోంది. ఎఫ్‌పీ షాపుల ద్వారా పేదలకు సరుకులు అందడం లేదు. అరకొరగా నిత్యావసరాలు పంపిణీ చేస్తూ దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న నిరుపేదల కడుపుకొడుతోంది. నిత్యావసర సరుకుల పంపిణీలోనూ కోతలు విధిస్తుండటంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలలో ప్రతి నెలా తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు అందేవని లబ్ధిదారులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం కేవలం బియ్యం, చక్కెర మాత్రమే అందజేస్తూ చేతులు దులుపుకుంటోంది. ఇక రేషన్ లబ్ధిదారులకు ఆధార్ అనుసంధానం, బయోమెట్రిక్ సాకుగా చూపి కొందరి కార్డులను తొలగించేందుకు కుట్రలు పన్నుతోంది. కొన్ని షాపుల్లో సర్వర్ సమస్య, వేలిముద్రల నమోదు, ఈ-కేవైసీ నమోదు కావడం లేదు. రేషన్‌కార్డులో ఉన్న కొంత మంది బియ్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తోంది. ప్రతి నెలా సరుకులు అందక వినియోగదారులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను ఇప్పటికే అస్తవ్యస్తం చేసిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అరకొరగా అందించే సరుకులు క్రమంగా తగ్గిపోవడంతో వినియోగదారులు కూడా ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

తొమ్మిది రకాల సరుకులకు మంగళం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద కుటుంబాలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఎఫ్‌పీ షాపుల ద్వారా తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు అందించే వారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుతం కేవలం బియ్యం, చక్కెరతోనే సరి పెడుతోంది. దీంతో కార్డుదారులు పూర్తిస్థాయిలో సరుకులు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం గోధుమ పిండి, పామాయిల్, బెల్లం, కంది బ్యాళ్లు, కారం పొడి, ఉప్పు ఇతరాత్ర సరుకులను ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయడం ఆపేసింది. బయట మార్కెట్లో చక్కెర రూ.45, బెల్లం రూ.50, కంది బ్యాళ్ల రూ.130, పామాయిల్ రూ.145, గోధుమ పిండి రూ.55, ఉప్పు రూ.25 చొప్పున అధిక ధరలు చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నామని ప్రజలు వాపోతున్నారు.

నియోజకవర్గంలోని ఎఫ్‌పీ షాపుల వివరాలు..

మండలం	ఎఫ్‌పీ షాపులు	లబ్ధిదారులు
రొళ్ల	26	11,650
అగళి	26	10,467
గుడిబండ	43	16,666
అమరాపురం	38	17,528
మడకశిర	60	25,330

అన్ని సరుకులు అందజేయాలి



రేషన్‌షాపుల్లో గత ప్రభుత్వం అందించిన విధంగా అన్ని రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం కేవలం బియ్యం, చక్కెర మాత్రమే అందిస్తోంది. బయట మార్కెట్లో సరుకులు కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అన్ని రకాల సరుకులను ఎఫ్‌పీ షాపుల ద్వారా ప్రజలకు అందించేలా చొరవ తీసుకోవాలి.

– చిన్న రంగప్ప, సర్పంచ్, రత్నగిరి పంచాయతీ

అక్రమాలు జరుగుతున్నాయి



చౌకదుకాణాల్లో కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. కేజీ నుంచి రెండు కిలోల వరకూ బియ్యం తక్కువగా వేస్తున్నారు. అధికారులకు ఈ విషయం తెలిసినప్పటికీ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా పూర్తిస్థాయిలో సరుకులు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ తాలూకా జేసీఎస్ బూత్ ఇన్‌చార్జ్, రంగనపల్లి

అవకతవకలకు పాల్పడితే చర్యలు



ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎఫ్‌పీ షాపుల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు. బియ్యంతో పాటు మిగిలిన ఒకటిరెండు సరుకులు కార్డుదారులకు అందిస్తున్నాం. కిలో, రెండు కిలోల వరకూ సరుకులు తక్కువగా ఇస్తే రేషన్ లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకురావాలి. అలాంటి డీలర్, ఎండీయూ ఆపరేటర్లపై చర్యలు తీసుకుంటాం. ప్రతి నెల 16వ తేదీ వరకూ షాపుల వద్దనే డీలర్లు అందుబాటులో ఉండి ఎండీయూ ఆపరేటర్ల ద్వారా సరుకులు ఇవ్వాలి.

– షేక్షావలి, తహసీల్దార్, రొళ్ల మండలం

ఘనంగా ‘రన్ ఫర్ జీసస్’



మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్, కరీం

హిందూపురం: గుడ్ ఫ్రైడే ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకుని పట్టణంలో సీఅండ్ఐజీ మిషన్ చర్చ్ మిషన్ కాంపౌండ్ ఆధ్వర్యంలో యూపీసీఎల్‌ఏ పాస్టర్ ఫెలోషిప్ సహకారంతో పురవీధులలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని డీఎస్పీ వి.మహేష్, సీఐలు రాజగోపాల్ నాయుడు, కరీం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్లు స్టీఫెన్ రాజ్, సూర్యప్రకాష్, కిరణ్ మోహన్, దేవరాజ్‌లు మాట్లాడుతూ క్రీస్తు దయామయుడని, ఆయన అందరిపై కృప చూపుతారన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంఘ సెక్రటరీ డాక్టర్ ఏ నాగేంద్ర కుమార్, కోశాధికారి సాల్మన్ రాజ్, సహకారదర్శి అరుణ్ కుమార్, సభ్యులు, పాస్టర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి

పెనుకొండ: నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళీ శాఖ మంత్రి సవిత తెలిపారు. శనివారం మంత్రి తన క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి సీజన్ కావడంతో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని, అధికారులు తక్షణ చర్యలు చేపట్టి సమస్య ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 57 నూతన బోర్లు వేయించినట్లు మంత్రి తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: మినీ అంగన్‌వాడీ సెంటర్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ శాంతికి వారు వినతిపత్రం అందించారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాము, అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కార్యదర్శి శోభమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ మినీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న విజయవాడ అలంకార్ సెంటర్‌లో ధర్నా చేపడుతున్నామన్నారు. ప్రాజెక్ట్ అధ్యక్షురాలు అరుణ, సెక్టర్ లీడర్స్ విజయలక్ష్మి, శైలమ్మ, విజయలలిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మడకశిర రూరల్: మండల పరిధిలోని మణూరు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ.. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని బాలింతలు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలింతలు, గర్భిణులు ఆకుకూరలను బాగా తీసుకోవాలన్నారు. అనంతరం పౌష్టికాహారంతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు.

ఘనంగా వేణురెడ్డి జన్మదిన వేడుకలు



పార్టీ కార్యాలయంలో వేణురెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దీపిక

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత , సమన్వయకర్త టీఎన్ దీపిక భర్త వేణురెడ్డి జన్మదిన వేడుకలు హిందూపురం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త దీపిక, పార్టీ శ్రేణుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. కదిరి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ వేణురెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చిలమత్తూరు, లేపాక్షి మండల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వేణురెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా అందించాలి

అగళి/గోరంట్ల: ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా ఇవ్వాలని సీఎస్‌డీటీ భాగ్యలక్ష్మి సూచించారు. శనివారం అగళి తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ప్రజలకు రేషన్ సరుకులు అందించాలని ఆదేశించారు. అలాగే రేషన్ పంపిణీలో డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ మారుతీప్రసాద్ హెచ్చరించారు. శనివారం గోరంట్ల ఎంపీడీఓ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు.

వృద్ధాప్యంలో ప్రశాంత జీవనం గడపాలి



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ

హిందూపురం అర్బన్: మానసిక ఆందోళనలకు గురికాకుండా ప్రశాంత జీవనం గడపాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ వృద్ధులకు సూచించారు. శనివారం పట్టణ పరిధిలోని నిర్మలా వృద్ధాశ్రమం , శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న వెంకటేశ్వర వృద్ధాశ్రమం, పరిగి మండలంలోని ప్రశాంత నిలయంలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మనిషి జీవితంలో వృద్ధాప్యం చాలా విలువైనదన్నారు. మానసిక ఆందోళనలకు గురికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకొంటూ జీవనం సాగించాలన్నారు. ప్రభుత్వం అందించే పింఛన్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హతలు ఉండి పింఛన్ అందకపోతే వివరాలు అందిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికంగా వృద్ధులకు వైద్యసేవలు అందించేలా అధికారులతో చర్చించినట్లు తెలిపారు. వన్ టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు మాట్లాడుతూ వృద్ధులు మెరుగైన ఆరోగ్యం కోసం నడక, యోగా చేయాలన్నారు. అనంతరం అదనపు జిల్లా జడ్జి వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు తన సొంత నిధులతో దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాది సంతోషికుమారి, వృద్ధాశ్రమాల నిర్వాహకులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా లైనింగ్ పనులు ఆపాలి

సోమందేపల్లి: అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా హంద్రీనీవా కాలువ మరమ్మతులు చేయకుండా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని జల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. శనివారం సోమందేపల్లి వద్ద తెగిపోయిన కాలువను వారు పరిశీలించారు. అనేక దఫాలు కట్ట తెగిన ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టకుండా గత ప్రభుత్వంపై నెట్టడం తగదని తెలిపారు. కట్ట ప్రాంతంలో కంప చెట్లు పెరిగి అక్కడక్కడా కట్టపై గుండ్లు పడ్డాయని హంద్రీనీవా అధికారులతో పాటు టీడీపీ ఎమ్మెల్యేల దృష్టికి తాము తీసుకు వెళ్లినా పట్టించుకోలేదన్నారు. అదేలైనింగ్ పనులు ఆపి కాలువ వెడల్పుకు చర్యల తీసుకోవాలని డిమాండ్ చేశారు. మడకశిర నియోజకవర్గంలో 265 చెరువులకు సాగునీరుఇచ్చి కాలువ పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యాన్ని పెంచి సోమందేపల్లి వద్ద గుడిపల్లి ప్రాంతంలో రిజర్వాయర్ మడకశిరలోని రత్నగిరి వద్ద మరో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాన్నారు. చిలమత్తూరు గోరంట్ల మండలాల్లో హంద్రీనీవా కాలువ నిర్మాణం చేపట్టి ఆ ప్రాంతంలోని రైతులకు సాగునీరు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాశీం, నాయకులు హనుమంత రెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రభుత్వాసుపత్రి వద్ద వైద్యులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్, సిబ్బంది

హిందూపురం అర్బన్/పెనుకొండ/మడకశిరరూరల్ : ఆస్పత్రుల్లో షార్ట్ సర్క్యూట్, ఇతర కారణాలతో జరిగే ప్రమాదాల నుంచి ఎలా భయట పడాలన్నదానిపై వైద్యులు, సిబ్బందికి ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్ అవగాహన కల్పించారు. జాతీయ అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద ఎమర్జెన్సీవార్డ్, ఎలెక్ట్రిక్ ప్యానల్, జనరల్ వార్డుల్లో షర్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరిగినప్పుడు దగ్గరలో ఉన్న సీఓ2 ఎస్టింగ్ విషర్, ఏబీసీ ఎస్టింగ్ విషర్ ద్వారా మంటలు ఎలా ఆర్పాలి, రోగులు, చిన్నారులను, మహిళలను ఎలా భయటకు తీసుకు రావాలో చేసి చూపించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణం 08556 220888 లేదా 101కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ లింగన్న, ఆర్ఎంఓ డేవిడ్‌రాజు, నర్సింగ్ సూపరింటెండెంట్ చంద్రకళ, ఓబుళమ్మ, సెక్యూరిటీ సూపర్‌వైజర్ అశోక్ పాల్గొన్నారు.

- పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అగ్ని ప్రమాదాలపై ఫైర్ ఆఫీసర్ వెంకటేసులు అవగాహన కల్పించారు. ఆస్పత్రుల్లో షార్ట్ సర్క్యూట్, ప్రమాదాలు సంభవించినప్పుడు సిబ్బంది, రోగులు తొందరపాటు పడకూడదన్నారు.
- మడకశిర మండలంలోని కదిరేపల్లి పీహెచ్‌సీ వద్ద అగ్ని ప్రమాదాలపై అగ్ని మాపక అధికారి కె.వి జయకుమార్ అవగాహన కల్పించారు.

మాట తప్పని నేత వైఎస్ జగన్

- పైడేటిలో ‘కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్’ కార్యక్రమంలో మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



పైడేటిలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమంలో కాఫీ తాగుతున్న ఉషశ్రీ చరణ్

పరిగి: మాట తప్పని నేత మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయ కర్త ఉషశ్రీచరణ్ తెలిపారు. శనివారం మండలంలోని పైడేటిలో ‘కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్’ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి వీధిలోనూ ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ప్రతి ఇంటా సంక్షేమ పథకాల అమలులో తాజా కూటమి సర్కార్‌కు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించాలని తెలిపారు.

నమ్మించి మోసం చేయడంలో దిట్ట చంద్రబాబు..

గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడుకు నమ్మించి మోసం చేయడం కొత్తేమీ కాదని పైడేటి గ్రామస్తులు ఉషశ్రీచరణ్ ముందు వాపోయారు. గత ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి నేతలు ఇచ్చిన హామీలతో మరోసారి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చి ఉంటే పథకాలు వర్తించేవన్నారు. కూటమి సర్కార్ వచ్చి పది నెలలు అవుతున్నా నేటికీ రూపాయి కూడా అందించలేకపోయినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా కూటమి సర్కార్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క నయా పైసా కూడా లంచం ఇవ్వకుండా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు సచివాలయ వ్యవస్థ ద్వారా పొందినట్లు పైడేటి గ్రామస్తులు తెలిపారు. కానీ నేటికీ కూటమి ప్రభుత్వ హయాంలో పథకాలు కావాలంటే లంచాలు అడుగుతున్నారని అన్నారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన కూటమి ప్రభుత్వాన్ని సాగనంపడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సవిత, సర్పంచ్ గంగాదేవి, మండల కన్వీనర్ నరసింహమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చల్లగా చూడమ్మా.. నల్ల రాళ్ల గంగమ్మా



ప్రత్యేక అలంకరణలో నల్ల రాళ్ల గంగమ్మ

పావగడ: పట్టణంలోని మూడు ముఖాల నేల ప్రాంతంలో వెలసిన నల్ల రాళ్ల గంగమ్మ, ఏడుగురు అక్క దేవతల జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, పసుపు అలంకార పూజలు నిర్వహించారు. సాయంత్రం గంగ పూజ చేశారు. ముత్తయిదువులు వారి ఇళ్ల నుంచి తీసుకొచ్చిన తామ్రపు చెంబులోని నీటితో అమ్మవారికి గంగపూజ చేపట్టారు. అనంతరం ద్వారకామయి సంకీర్తన భక్త బృందం నిర్వహించిన భజన ఆకట్టుకుంది. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజలు చేశారు.

వేద బ్రహ్మ రాజేశ్ స్వామి అమ్మవార్లకు వైభవంగా పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలు చైత్ర లక్ష్మీబాబు తదితరులు భక్తులకు సేవలందించారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



దొడగట్టలో అంబేడ్కర్ విగ్రహం వద్దకు జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

రొద్దం: మండలంలోని దొడగట్ట గ్రామంలో శనివారం జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ నెల 14 అంబేడ్కర్ జయంతి నిర్వహించాల్సి ఉండగా, గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆరోజు జయంతి వేడుకలు నిర్వహించలేకపోయామని శనివారం జరుపుకోవాల్సి వచ్చిందని ఎమ్మార్పీఎస్ నాయకుడు గోపాల్ తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం వద్దకు మహిళలు జ్యోతులు మోశారు.అనంతరం అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగించారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వక్తలు సూచించారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో శనివారం ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ఈ వేస్ట్ మెటీరియల్‌ను రీసైకిల్ చేయాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర స్థాపనకు కృషి చేస్తామని ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఇళ్లలోని, దుకాణాల్లోని ఈ వేస్టేజీ(చెడిపోయిన ఎలక్ట్రికల్ పరికరాలు) మున్సిపల్ కార్యాలయంలో లేదా సచివాలయాల్లో అందజేయాలని సూచించారు.



గోరంట్లలోని డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి హరినారాయణ

గోరంట్ల/హిందూపురం/లేపాక్షి/ అమరాపురం/రొళ్ల/ అగళి/ గుడిబండ/పెనుకొండ/ సోమందేపల్లి/రొద్దం: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా ప్రత్యేక అధికారి హరినారాయణ పేర్కొన్నారు. గోరంట్ల మండల కేంద్రంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. జిల్లా ప్రత్యేక అధికారి హరినారాయణ గోరంట్లలోని పలు దుకాణదారులతో మాట్లాడారు. చెత్తను రోడ్లపై పడేయొద్దని సూచించారు. అనంతరం మూడో వార్డులోని రాజశేఖర్‌రెడ్డి అనే దుకాణదారుడితో మనమిత్ర ఈ గవర్నెన్స్ వాట్సాప్ నంబర్‌తో హాయ్‌ని పెట్టించారు. మన మిత్ర వాట్సాప్ గ్రూప్ ద్వారా 161 పౌర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన తెలియజేశారు. అనంతరం మూడో వార్డులో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును (చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని) పరిశీలించారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అధికారులు స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సమత, పుట్టపర్తి రెవెన్యూ డివిజనల్ అధికారిణి సువర్ణ, తహసీల్దార్ మారుతి తదితరులు పాల్గొన్నారు. అలాగే హిందూపురం, లేపాక్షి, అమరాపురం, రొళ్ల, అగళి, గుడిబండ, పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం మండలాల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ పరికరాలతో పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ఆ పరికరాల వేస్టేజ్ వల్ల మానవాళి మనుగడకే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మల్లేష్ (ఫైల్)

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందాడు. కియా స్టేషన్ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెన్నెకొత్తపల్లి మండలం చిన్నపల్లికి చెందిన కురుబ మల్లేష్ (21) కియా కార్ల కంపెనీ అనుబంధ పరిశ్రమ అయిన అనంత టెక్‌లో పనిచేస్తున్నాడు. శనివారం మిత్రుడు సురేష్‌తో కలసి ద్విచక్ర వాహనంలో అమ్మవారిపల్లికి బయల్దేరాడు. మార్గం మధ్యలో గుట్టూరు శివారులోని బన్నీ రెస్టారెంట్ వద్దకు రాగానే పెట్రోల్ కోసమని రోడ్డు దాటుతుండగా బెంగళూరు నుంచి అనంతపుం వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను స్థానికులు 108 వాహనంలో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ఆస్పత్రికి పంపించారు. కియా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.